అలంపూర్ క్షేత్రంలో అఘోరీ

భక్తులను ఆశీర్వదిస్తున్న నాగసాధు అఘోరీ

అలంపూర్, అక్టోబర్ 8 : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఐదో శక్తిపీఠమైన అలంపూర్ ఆలయాలను నాగసాధు అఘోరీ దర్శించుకున్నది. మంగళవారం జోగుళాంబ దేవి, బాలబ్రహ్మేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలతో కలిసి హోమం చేసి భక్తులను ఆశీర్వదించారు.

సంతానలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ


సంతానలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ

మంత్రాలయం, అక్టోబర్ 8 : ప్రముఖ పుణ్య క్షేత్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో కొలువు దీరిన గ్రామ దేవత మంచాలమ్మ సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గ్రామ దేవత మంచాలమ్మను తుంగభద్ర నది జలాలతో అభిషేకించి, గాజులు, బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అశేష సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మఠం అధికారులు, పండితులుపాల్గొన్నారు.

గోమాతకు సీమంతం

అలంపూర్, అక్టోబర్ 8: అలంపూర్ క్షేత్రంలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో మంగళవారం ఆర్యవైశ్యులు చూళాని గా ఉన్న (గర్భిణి) గోమాత (ఆవు)కు సీమంతం చేశారు. సాధారణ గర్భిణిగా ఉన్నప్పుడు ఏవిధంగా చేస్తారో ఆ విదంగా చీర సారె లతో సాంప్రదాయ బద్దంగా సీమంతం నిర్వహించారు.మహిళలు సంతోషంతో ఆడి పాడారు. అనంతరం అందరికి కడిచి కాయలు,మిఠాయిలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఆర్యవైశ్యులందరు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- బిచ్చాలి పీఠాధిపతి వీరభద్ర శివాచార్య స్వామి

బిచ్చాలి పీఠాధిపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ రూరల్ ,అక్టోబర్ 8 : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రజలందరూ ఆధ్యాత్మికత భావాలను కలిగి ఉండాలని బిచ్చాలి పీఠాధిపతి వీరభద్ర శివాచార్యస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుడిదొడ్డి గ్రామంలో వెలిసిన శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను కలిగి సేవా దృక్పథంలో నడవాలని సూచించారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చిన్ననాటి నుంచే మంచి లక్షణాలను అలవరుచుకునే విధంగా ఆధ్యాత్మిక భావాల వైపు మరల్చాలని సూచించారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి ఎమ్మెల్యే విజయుడు,గ్రామస్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠాపనకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వావిలాల రంగారెడ్డి, సత్యారెడ్డి, నీలకంఠరెడ్డి, హనుమంతురెడ్డి, ఎద్దుల రాముడు తదితరుల పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇద్దరు యువకుల గొడవ

అమరచింత, అక్టోబర్ 8: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు యువకులు మద్యం మత్తులో గొడవ పెట్టుకుని ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకోవడంతో పక్కనే ఉన్న ఇండియా నెంబర్-1 ఏటీఎం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఏటీఎం పక్కనే ఉన్న టీకొట్టు వద్ద ఛాయ్ తాగేందుకు వచ్చిన వారి కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన వెంకటేశ్, మరో యువకుడితో మద్యం మత్తులో గొడవ పెట్టుకుని మాటామాట పెరగడంతో రోడ్డు పక్కనే ఉన్న రాళ్లను విసరడంతో ఏటీఎం అద్దాలు పగిలిపోయాయి. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సురేశ్ తెలిపారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

అలంపూర్, అక్టోబర్ 8 : మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి సంబంధించి చేపట్టిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నర్సింగరావు, జిల్లా అంబుడ్స్‌మెన్ పర్సన్ జమ్మన్న, విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. వివిధ పనులపై జరిమానా రూపంలో రూ.21,000, రికవరీ రూపంలో రూ.65,230 మొత్తం రూ. 86,230 బాధ్యులనుంచి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతి, ఎస్ఆర్పీ శ్రీకాంత్, ఏపీవో రాజు పాల్గొన్నారు.

గోప్లాపూర్‌లో ఫ్రైడే డ్రైడే

పాన్‌గల్, అక్టోబర్ 8: మండలంలోని గోప్లాపూర్‌లో మండల వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధులను తిరిగి మురుగు నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. కీటకజనిత వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా నీటి నిల్వలను తొలగించాలని కోరారు. గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పాన్‌గల్, అక్టోబర్ 8: మండలంలోని బండపల్లికి చెందిన వెంకటస్వామికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును మంగళవారం మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు అందజేశారు. కార్యక్రమంలో నర్సయ్య, యుగేందర్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాముడు, నాగరాజు, డీలర్ నర్సింహా, లక్ష్మయ్య, నాగేశ్వర్, బాలమసి, బాలకృష్ణయ్య, మణెయ్య తదితరులు పాల్గొన్నారు.

పులికల్‌లో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అయిజ, అక్టోబర్ 8 : మండలంలోని పులికల్ గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాలనీలో లోవోల్టేజ్ సమస్యతోపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో కాలనీవాసులు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. కాలనీలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

మొక్కలను పరిశీలించిన ఎంపీడీవో

ఉండవెల్లి, అక్టోబర్ 8 : 44వ జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో నాటిన హరితహారం మొక్కలను ఎంపీడీవో తిరుపతన్న మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు బాగా పెరిగేందుకు చుట్టూ ఉన్న కలువు మొక్కలను పూర్తిగా తొలగించాలని సూచించారు. అదేవిధంగా మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి సంరక్షించాలని ఆదేశించారు.

బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం

- విద్యుత్ ఉద్యోగుల ఖాతాల్లో అడ్వాన్స్‌గా 3 నెలల వేతనం
- విత్‌డ్రా చేసుకున్న ఉద్యోగులు
- రికవరీ చేసేందుకు బ్యాంకర్ల తిప్పలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 8 : నాగర్‌కర్నూల్‌లో ఎస్‌బీఐ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ఉద్యోగుల ఖాతాల్లో అడ్వాన్స్‌గా మూడు నెలల వేతనం జమైంది. ఉద్యోగుల ఖాతాల్లో రూ.4.5 కోట్లు జమ చేయాల్సిన అధికారులు రూ.14.55 కోట్లను జమ చేశారు. ఈ సంఘటన గత ఐదు రోజుల కిందట జరిగగా ఆలస్యంగా తేరుతున్న బ్యాంకు అధికారులు వాటిని రికవరీ చేసేందుకు ముప్పుతిప్పలు పడుతున్నారు. జిల్లాలోని విద్యుత్‌శాఖలో 506 మంది ఉద్యోగుల నెలసరి వేతనాల చెల్లింపుల కోసం సదరు శాఖ ఉన్నతాధికారులు రెండు చెక్కులు రూ.1.85 కోట్లు, మరో చెక్కు రూ.3 కోట్లతో మొత్తం రూ.4.85 కోట్ల చెక్కులను ఉద్యోగుల వేతనాల కోసం సిద్ధం చేశారు. తర్వాత వారి జాబితాతోపాటు ఖాతా నెంబర్లను జిల్లా కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో అప్పగించారు. స్థానిక క్యాషియర్ తోపాటు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక్కో ఉద్యోగికి మూడు నెలల వేతనం జమ చేశారు. బ్యాంకు లావాదేవీల్లో వ్యత్యాసాలు రావడంతో విషయం బయటకు పొక్కింది. ఈ విషయంలో విద్యుత్ అధికారులతోపాటు బ్యాంక్ అధికారులు వేర్వేరుగా ఆర్‌బీఐకి సమాచారం అందజేశారు. దీంతో అదనంగా వేతనాలు పడిన ఖాతాలను నిలిపివేసినప్పటికీ చాలా మంది ఉద్యోగులు అప్పటికే డబ్బులు డ్రా చేసుకున్నారు. మరికొందరు ఎందుకు ఇన్నిడబ్బులు పడ్డాయనే అనుమానం వచ్చినప్పటికీ విత్‌డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది.

దీంతో డ్రా చేసుకున్న వారి నుం చి డబ్బులు రికవరీ చేసేందుకు బ్యాంకు అధికారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. ఇం కా రూ.6 లక్షలకుపైగా డ్రా చేసుకున్న విద్యుత్ ఉద్యోగుల నుంచి రికవరీ చేయాల్సి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై మేనేజర్ మధుసూదన్‌రావును వివరణ కోరగా సాంకేతిక సమస్యతో ఇలా జరిగిందని, డ్రా చేసుకున్న వారి తోనూ డబ్బులు రికవరీ చేస్తామని తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం

వడ్డేపల్లి, అక్టోబర్ 8 : మండలంలోని తనగల గ్రామంలో మంగళవారం ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు రక్తపరీక్షలు, ఈసీజీ, ఎక్స్‌రే, దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ జయరాజు, డాక్టర్లు రాగచందన, భరత్, అజయ్, మనోజ్ఞ, సంపత్‌తోపాటు కాపరి సతీశ్‌కుమార్, సంఘ పెద్దలు రవి, యాకోబు, భాస్కర్, వర్ధరాజ్, ఏసన్న, దుబ్బన్న, రామన్న పాల్గొన్నారు.

గ్రిల్స్‌పైపడి వ్యక్తిమృతి

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 8 : ప్రమాదవశాత్తు గ్రిల్స్‌పైపడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు కొత్తకోటకు చెందిన బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఉద్యోగి కృష్ణారెడ్డి(60) మంగళవారం చౌరస్తా నుంచి పాతఎర్రవల్లికి రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఎన్ఏఐహెచ్ గ్రిల్స్‌పై పడి మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సమస్య రాకుండా చూడాలి

ఉండవెల్లి, అక్టోబర్ 8 : పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో ఉండి సమస్యలు రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో తిరుపతన్న ఆదేశించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన అవకాశం ఉన్నదని, పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేపట్టడంతోపాటు తాగునీటి ట్యాంకులను కూడా బ్లీచింగ్ వేసి శుభ్రపర్చాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించడంతోపాటు మహాలక్ష్మి ధ్రువపత్రాల పంపిణీ చేయాలన్నారు.

మెడిసిన్ విద్యార్థులకు సన్మానం

వైద్యవిద్యార్థిని సౌమ్యను సన్మానించిన దృశ్యం

పెబ్బేరు, అక్టోబర్ 8: మండలంలో ఇద్దరు విద్యార్థినులు వైద్య విద్యకు ఎంపిక కావడంతో వారిని ఘనంగా సన్మానించారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిద్ధి రాములు కుమార్తె సౌమ్యకు సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ఎస్ కాలేజీలో, రాంపురం గ్రామానికి చెందిన కొండల్‌యాదవ్ కుమార్తె ఆడెం వర్షకు హైదరాబాదులోని టీఆర్ఆర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో సీట్లు వచ్చాయి. రాంపురం గ్రామానికి చెందిన విద్యార్థినికి తొలిసారి మెడిసిన్ సీటు రావడం విశేషం. ఈ నేపథ్యంలో వారిని బంధు మిత్రులు అభినందించి సన్మానించారు.

మెడిసిన్ సీటు సాధించిన అఖిల

వడ్డేపల్లి, అక్టోబర్ 8 : గత పదేండ్లు అనారోగ్యంతో మంచానపడ్డ తల్లి ఒక వైపు, ఆర్థిక ఇబ్బందులు మరో వైపు ఉన్నప్పటికీ, తన తల్లిలా మరొకరికి అనారోగ్య బాధలు ఉండరాదని వైద్యవృత్తిని చేపట్టాలనే ఆశయంతో కష్టపడి చదివి మెడిసిన్ సీటు సాధించిన అఖిల అందరికీ ఆదర్శంగా నిలిచింది. మండలంలోని కొంకల గ్రామానికి చెందిన రామాజనేయులుగౌడ్, మహేశ్వరమ్మకు ఒక కుమార్తె కుమారుడు ఉన్నా తండ్రి సంపాదన అంతంత మాత్రం కావడం, తల్లి అనారోగ్యంతో మంచాన పడి ఉండడంతో ఎలాగైనా సరే తాను డాక్టర్ కావాలని నిర్ణయించుకుంది. అందుకోసం కష్టపడి చదివి నీట్‌లో 499 మార్కులు సాధించి జోగుళాంబ గద్వాల మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటును సాధించింది. అఖిల మెడికల్ సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కళాశాలలో జాయిన్ కావడానికి తదితర ఖర్చులకు కూడా ఇబ్బందులు ఉన్నందున దాతలు సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అయిజ విద్యార్థినికి మెడిసిన్ సీటు

అయిజ, అక్టోబర్ 8 : అయిజ పట్టణానికి చెందిన ద్యావర అక్షర జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. పట్టణానికి చెందిన ద్యావర విజయ్ కుమార్ కూతురుకు అక్షర నీట్‌లో చక్కటి ర్యాంక్ సాధించి మెడిసిన్‌లో సీటు సంపాదించడంతో తల్లిదండ్రులు, పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

మూలానక్షత్ర దీపోత్సవం

మల్దకల్, అక్టోబర్ 8: ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం దసరా శరన్నవరాత్రుల పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేకంగా మూడు రోజులపాటు మూలానక్షత్రం దీపోత్సవ కార్యక్రమం ఉంటుందని చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో చోటు

గట్టు, అక్టోబర్ 8: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కమిటీలో గట్టు నాయకులకు స్థానం లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నర్సింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కులదీప్‌నాయర్, రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేశ్ ఎన్నికయ్యారు.

వాణిజ్య

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.



బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ప్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహ మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.

ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వ్‌బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షల్లో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండు మల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండు మల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ర్టానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ర్టాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ర్టానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్ఎస్ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.